## క్లుప్తంగా

### అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు



ఎస్.రాయవరంలో పట్టుబడిన ట్రాక్టర్లు

ఎస్.రాయవరం: అనుమతులు లేకుండా మట్టి, ఇసుక, గ్రావెల్ తవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్యామ్ కుమార్ హెచ్చరించారు. వాకపాడు చెరువు నుంచి మండల కేంద్రం మీదుగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం రెవెన్యూ సిబ్బంది పట్టుకుని సీజ్ చేశారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై ఇకపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు, ఇళ్ల నిర్మాణదారులు అవసరమయితే అనుమతులు తీసుకోవాలన్నారు. పట్టుబడిన ట్రాక్టర్ యజమానుల నుంచి అపరాధ రుసుం కట్టించుకుని ట్రాక్టర్లు విడుదల చేస్తామన్నారు.

### 26 నుంచి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పాయకరావుపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి జూన్ 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో పాటు వృత్తి విద్యా కోర్సులకు కూడా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### మోసాల పట్ల అప్రమత్తం

మునగపాక: మహిళలు మోసాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అరబుపాలెం సచివాలయ మహిళా పోలీసు హేమలత తెలిపారు. మండలంలోని అరబుపాలెంలో బుధవారం మహిళలు మోసపోతున్న విధానాలపై అవగాహన కల్పించారు. నిరక్షరాస్యులైన మహిళలను కొంతమంది మోసగాళ్లు లక్ష్యం చేసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఏటీఎం వినియోగం, అలాగే పిన్ నంబర్లు, ఓటీపీ వంటి విషయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### రెసిడెన్షియల్ పరీక్షకు ఆరుగురి ఎంపిక

మునగపాక: ఇటీవల నిర్వహించిన జ్యోతిరావ్ పూలే రెసిడెన్సియల్ పరీక్షకు మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం సూర్యనారాయణ తెలిపారు. బుధవారం విద్యార్థులను అభినందించారు. ఏకాగ్రతతో చదువుకుంటే పోటీ పరీక్షల్లో రాణించవచ్చన్నారు. హైస్కూల్ నుంచి పది మంది విద్యార్థులు పరీక్ష రాయగా వారిలో ఆరుగురు అర్హత సాధించారన్నారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు శివకోటి దుర్గాప్రసాద్‌ను ఆయన అభినందించారు. ఎల్లబెల్లి మేఘన ,తెరపల్లి సాత్విక, కొత్తపల్లి లహరిదేవి, పోతురాజు నవీన్‌కుమార్, దళాయి హరిణి భవానీ, భవానీ శంకర్ ఎంపికైన వారిలో ఉన్నారు.

### ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: మండలంలో కాగిత గ్రామంలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు ఎంపీడీవో సీతారామరాజు బుధవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండుటెండలో ఉపాధి పనులకు వస్తున్న కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ వీటిని ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. స్థానిక ఏఎన్ఎంల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే స్థానిక సర్పంచ్ పోతంశెట్టి రాజేష్ కూలీలకు ఉచితంగా వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికుల కృషి గొప్పది

అనకాపల్లిటౌన్ : పారిశుధ్య కార్మికుల కృషి ఎనలేనిదని వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ అన్నారు. స్థానిక సర్వకామదాంబ పార్క్ వద్ద బుధవారం ఆయన పారిశుధ్య కార్మికులకు 12 లీటర్ల కొబ్బరి నూనె, 12 బాత్‌సోప్‌లు పంపిణీ చేశారు. పారిశుధ్య వాహనం రాకను గమనించి తడి, పొడి చెత్తను వేరు చేసి వారికి అందించాలని స్థానికులను కోరారు. జీవీఎంసీ ప్రజారోగ్య అధికారి ఎస్.ఎస్.రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మాడుగుల అప్పారావు, బొండా శంకరరావు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఉపయుక్తం వేసవి శిక్షణ శిబిరాలు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న బాల బాలికలు

యలమంచిలి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా యలమంచిలి శాఖా గంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయుక్తంగా ఉన్నాయని గ్రంథాలయాధికారి ఆనంద్ అన్నారు. పోటీ పరీక్షల కోసం ఆంగ్లంపై పట్టు సాధిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, విషయ అవగాహన, స్టోరీ టెల్లింగ్ వంటి అంశాలపై బుధవారం విశ్రాంత అధ్యాపకుడు వై. అప్పారావు శిక్షణ ఇచ్చారు. యలమంచిలి పట్టణానికి చెందిన పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

**సైన్స్ ప్రయోగాలపై అవగాహన**

మునగపాక: వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయుడు పిల్లా జగదీష్ కోరారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు వృధా చేయకుండా ఇటువంటి తరగతులను వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీడీసీ నిర్వాహకులు కేవీఎస్ అప్పారావు, శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రంథాలయాలు మానసిక వికాస కేంద్రాలు**

కోటవురట్ల: గ్రంథాలయాలు మానసిక వికాసానికి తోడ్పడతాయని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం, దేశభక్తి గీతాలాపన, ఆలోచింపజేసేలా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌గా సామాల శ్రీను వ్యవహరించగా జన విజ్ఞాన వేదిక సభ్యుడు త్రిమూర్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## జగనన్న శాశ్వత భూహక్కుతో అక్రమాలకు చెక్



రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేస్తున్న సంధ్యారాణి

యలమంచిలి : జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంతో భూ అక్రమాలకు చెక్ పెట్టవచ్చని జెడ్పీటీసీ సభ్యురాలు సేనాపతి సంధ్యారాణి అన్నారు. మండలంలో ఏటికొప్పాక సచివాలయంలో బుధవారం రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు రీసర్వే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. గ్రామాల్లో ఎప్పటి నుండో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు రీసర్వే ద్వారా పరిష్కారమవుతున్నాయని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పేద ప్రజల భూములు అన్యాక్రాంతం కాకుండా రీసర్వే పక్కాగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, పార్టీ గ్రామ అధ్యక్షుడు కరణం రవి, సచివాలయ కన్వీనర్ పెదపూడి కుమారి, దిమిలి రమణబాబు పాల్గొన్నారు.

## రైతులకు మొక్కల పంపిణీ





రైతులకు మొక్కలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్‌బీఐ గ్రామసేవా కేంద్రం ఆధ్వర్యంలో సమకూర్చిన మొక్కలను ఆయన బుధవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రతినిధులు నవీన్, భారతి, రైతులు రాము, వాసు, శరగడం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



రాజయ్యపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాసులమ్మ తదితరులు

నక్కపల్లి: ఇచ్చిన మాట ప్రకారం వేటనిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని జెడ్పీటీసీ సభ్యురాలు, మత్స్యకార సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గోసల కాసులమ్మ అన్నారు. బుధవారం ఆమె రాజయ్యపేటలో మత్స్యకారులతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేట నిషేధ సమయంలో గంగపుత్రులందరికీ రూ.10 వేల నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారన్నారు. వరుసగా 5 పర్యాయాలు ఈ సాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చే రెండు వేల రూపాయలు సరైన సమయంలో విడుదల చేసేవారు కాదన్నారు. మరుసటి ఏడాది నిషేధ సమయం వచ్చే వరకు దళారుల చుట్టు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన దుస్థితి ఏర్పడేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఆ ఇబ్బందులు లేవన్నారు. దళారుల ప్రమేయం లేకుండానే నేరుగా బటన్ నొక్కి ఈ ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. మత్స్యకారులకు నిజమైన భరోసా జగనన్న ప్రభుత్వంలోనే లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యజ్జల అప్పలరాజు, పైడితల్లి, మహాలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు



ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

పాయకరావుపేట : ఈ నెల 8 నుండి 17 వరకు గాజువాకలోని ఎస్ఆర్ డీజీ స్కూల్లో నిర్వహించిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో జరిగిన ఖోఖో పోటీల్లో శ్రీప్రకాష్ ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రథమ స్థానం దక్కించుకుని పతకాలు సాధించారని ఆ పాఠశాల ఎన్‌సీసీ విభాగం ఏఎన్‌వో ఎండీ ఇబ్రహీం తెలిపారు. శిబిరంలో రైఫిల్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, కంపాస్ రీడింగ్, డ్రిల్ ప్రాక్టిస్, గన్ పార్ట్స్ మొదలైన వాటిలో విద్యార్థులు శిక్షణ పొందారని ఆయన తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి తదితరులు అభినందించారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



విద్యా సంస్థల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ఎస్ఐ అలీ

మునగపాక: విద్యా సంస్థల కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ మహ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. బుధవారం మునగపాక పోలీసు స్టేషన్‌లో మండలంలోని ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ యాజమాన్యం తప్పనిసరిగా స్కూళ్లు, కళాశాలలు, ఐటీఐల వద్ద కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. అలాగే గంజాయికి దూరంగా విద్యార్థులు ఉండేలా చూడాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా విద్యార్థులు మెలగడం ద్వారా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు వరలక్ష్మి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ వీసంకు సన్మానం



వీసం రామకృష్ణను సత్కరిస్తున్న నాయకులు

నక్కపల్లి: ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణను బుధవారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, వైస్‌ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ తదితరులు పార్టీ కార్యాలయంవద్ద వీసంను దుశ్సాలువ, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీబలోపేతానికి వీసం రామకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ పదవిని అప్పగించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వీసం అడుగుజాడల్లో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నడుచుకుంటామన్నారు. వీసంకు అభినందనలు తెలిపిన వారిలో సర్పంచ్‌లు పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, బీసీ సెల్ నాయకుడు మనబాల తాతారావు, ఒడ్డిమెట్ట దేవస్థానం మాజీ చైర్మన్ దండు బలరామరాజు తదితరులు ఉన్నారు.

## వైఎస్సార్‌సీపీ చొరవతో తాగునీరు సరఫరా



ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తున్న రాజు

రావికమతం: వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమిరెడ్డి రాజు మానవతా దృక్పథంతో కొత్తకోట గ్రామస్తులకు ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేశారు. వారం రోజులుగా గ్రామంలో మంచినీటి సరఫరా చేసే వాల్వ్ పని చేయలేదు. అది సరిచేశాక ట్యాంకు వద్ద సాంకేతిక లోపం, విద్యుత్ సమస్య తలెత్తింది. మరోపక్క ఎండలు మండిపోతుండటంతో తాగునీటికి కటకటలాడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమిరెడ్డి రాజు, ధనలక్ష్మి దంపతులు బుధవారం నుంచి ట్యాంకర్‌తో మంచినీరు తీసుకువచ్చి 11వ వార్డు నుంచి సరఫరా ప్రారంభించారు. ఎంతో మంది దాతలను కోరుతున్నా స్పందించలేదని, రాజు దంపతులు ముందుకు వచ్చి నీరు సరఫరా చేయడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. శాలువా కప్పి సన్మానించారు.

## సీసీ డ్రైన్ పనులకు శ్రీకారం



డ్రైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల గుండాలవీధి సాయినగర్ మురుగు కాలువ పనులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిష్కారానికి రూ.7 లక్షల నిధులు విడదలయ్యాయి. దీంతో ఈ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పనులు పూర్తయితే ప్రజల మురుగునీటి కష్టాలు తీరతాయన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాయినగర్ ప్రజల కష్టాలు గుర్తించిన రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతి చొరవతో నిధులు మంజూరైనట్టు తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. అందరికీ మంచి చేసే ఈ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతునివ్వాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, వార్డు సభ్యులు పొలమరశెట్టి కృష్ణ, సత్యనారాయణ, తర సత్యారావు, మూడవ సచివాలయం కన్వీనర్ ఆడారి ప్రసాద్, ఆర్‌టీసీ సత్యనారాయణ, గ్రామీణ నీటి సరఫరా విభాగం జేఈ శ్రీనివాసరావు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినికి స్వర్ణపతకం



స్వర్ణపతకంతో పూజిత

అచ్యుతాపురం(అనకాపల్లి): స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని నీరుకుండి పూజిత డీఆర్‌డీవో ఎన్‌సీసీ క్యాంపులో స్వర్ణపతకం సాధించింది. చెన్నైలో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు జరిగిన క్యాంప్‌లో బాస్కెట్‌బాల్ కేటగిరీలో పూజిత స్వర్ణం సాధించడం పట్ల విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ మంగళవారం అభినందనలు తెలిపారు.

## జగనన్న పాలనతోనే అభివృద్ధి సాధ్యం



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: జగనన్న సంక్షేమ పాలనతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. రాంబిల్లి సచివాలయం పరిధిలో గల రాంబిల్లి, వాడపాలెం గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న రావాలన్నారు. ప్రతి పక్ష పార్టీలను గెలిపిస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. మురుగు కాలువలు నిర్మించాలని, తమకు ఇళ్లు మంజూరు చేయాలని పలువురు కోరగా ఆయన సానుకూలంగా స్పందించి మంజూరు చేయిస్తానన్నారు. అనంతరం వలంటీర్లకు ఎమ్మెల్యే సొంత నిధులతో సమకూర్చిన వాటర్‌ప్రూఫ్ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ (తేజ), ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి ముఖ్యమంత్రి జగన్



రైతుకు ట్రాక్టర్ అందిస్తున్న సర్పంచ్ బెన్నమ్మ, నాయికులు

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రైతు సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న రైతు బాంధవుడని సర్పంచ్ యలగాడ బెన్నమ్మ అన్నారు. పీకే పల్లి ఆర్బీకేలో బుధవారం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా శ్రీ సాయి ఆదిత్య సీహెచ్‌సీ గ్రూప్‌నకు ట్రాక్టర్ అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గతంలో రైతులు వ్యవసాయం అంటే భయపడేవారని, పనుల కోసం వలసలు పోయే దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు పరిస్థితులు రైతులకు అనుకూలంగా మారాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా ద్వారా సాగుకు ప్రోత్సాహం ఇస్తూనే గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు నిర్మించి విత్తనాలు, ఎరువులు, యంత్రాలను రాయితీపై అందిస్తున్నారన్నారు. సీఎం జగనన్న ఆశయానికి ప్రకృతి కూడా సహకరిస్తూ సకాలంలో వర్షాలు పడుతూ సాగులో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ లోకవరపు బాబులు, పార్టీ నాయకులు జాగరపు శ్రీను, రైతులు పాల్గొన్నారు.

## గూటూరును పరామర్శించిన ఎమ్మెల్యే



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావును ఎమ్మెల్యే గొల్ల బాబూరావు బుధవారం పలకరించారు. శ్రీనివాసరావు అస్వస్థకు గురై కాకినాడ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. పట్టణంలో గల శ్రీనివాసరావు స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శ్రీనివాసరావును పలకరించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తురంగలపాలెంలో ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాదరావు

యలమంచిలి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రసాదరావు అన్నారు. మండలంలో షేకాలీపాలెం, తురంగలపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి వేసవి నుండి ఉపశమనం కోసం తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లతో కూడిన నీడను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కొందరు కూలీలు పనిముట్లు మంజూరు చేయాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్‌జీఎస్ అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి



బోధకాలు వ్యాధిగ్రస్తులకు కిట్లు అందజేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

మునగపాక: బోధకాలు వ్యాధిగ్రస్తులు ఆరోగ్యపరంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం బోధకాలు వ్యాధిగ్రస్తులకు మోర్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళ్లు శుభ్రపరుచుకునేందుకు టబ్ అలాగే మగ్గు, టవల్, ఆయింట్‌మెంట్‌తో కూడిన కిట్లు అందజేస్తున్నామన్నారు. వాటితో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఉమామహేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## యంత్ర వినియోగంపై రైతులు దృష్టి సారించాలి



రైతుకు ట్రాక్టర్ తాళం అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: యంత్ర వినియోగంపై రైతులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. రాంబిల్లిలో బుధవారం ఆయన గోకివాడ, గోవిందపాలెం గ్రామాలకు చెందిన రెండు రైతు గ్రూపులకు చెందిన రైతులకు రెండు ట్రాక్టర్లు అందించారు. ఒక్కో ట్రాక్టరుపై రూ. 2 లక్షల రాయితీపై ఈ ట్రాక్టర్లను అందించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం రాయితీపై యంత్రాలు అందజేస్తుందన్నారు. యంత్రాలతో సాగు చేయడం వల్ల ఖర్చు తగ్గడమే గాక త్వరితగతిన పనులు పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ (తేజ), ఎంపీపీ జి. శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల్ని చేర్పించండి'



ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని కోరుతూ ఇంటింటికీ తిరుగుతున్న ఉపాధ్యాయులు

తుమ్మపాల : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ సిరసపల్లి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కోరారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి ఎంపీయూపీ స్కూల్లో పిల్లల్ని చేర్పిస్తే, వారికి మంచి విద్యా బోధన జరిగేలా పూర్తి బాధ్యత తీసుకుంటానని ప్రధానోపాధ్యాయుడు పి.బాలసుబ్రహ్మణ్యం తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం 128 మంది పిల్లలు ఉన్నారని, గ్రామంలో లెక్కల మేరకు పాఠశాల రోల్ 175కు చేరేలా పెరిగేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో జగనన్న విద్యాకానుకతో సకాలంలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం తదితర సామగ్రి, జగనన్న గోరుముద్దతో పోషకాహారం, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు కొణతాల రాజేంద్రప్రసాద్, యర్రా చక్రవర్తి, ఎం.కె.వి.ప్రసాద్, సీహెచ్ కోమలత, జి.సూర్యకాంతం, సీహెచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.